పోటీ పరీక్షలపై దృష్టి సారించాలి : డీఈవో

గద్వాల సర్కిల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాల దశ నుంచే వివిధ పోటీ పరీక్షలపై దృష్టిసారించాలని డీఈవో విజయలక్ష్మి అన్నారు. గద్వాలలోని బాలభవన్‌లో మంగళవారం ఎస్‌సీఈఆర్టీ జనాభా విద్యా విభాగం ఆధ్వర్యంలో ఇంటర్‌నెట్ వాడకం అనే అంశంపై విద్యార్థులకు రోల్‌ప్లే పోటీ పరీక్ష నిర్వహించారు. పోటీల్లో మల్దకల్ మండలం అమరవాయి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రథమ, గద్వాల ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ, మోమిన్‌మహల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు డీఈవో విజయలక్ష్మి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

సన్నాలకు.. బోనస్ సున్నా..


అయిజ శివారులో సాగుచేసిన వరి పంట

- గతేడాది యాసంగి ధాన్యానికి అందని బోనస్
- 6 నెలలుగా ఎదురు చూస్తున్న రైతులు
- పెట్టుబడికి ఇబ్బందిగా ఉందంటున్న అన్నదాతలు

అయిజ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో వివిధ పథకాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే సన్నరకం ధాన్యం క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించింది. ఈ ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే ప్రభుత్వం రైతు ఖాతాలలో రూ.500 బోనస్ జమ చేస్తామని ప్రకటించింది. గతేడాది వానాకాలం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతుల బ్యాంకు ఖాతాలలో బోనస్ డబ్బులు జమ చేసింది. బోనస్ రావడంతో రైతులకు చాలా మేలు జరిగింది. అద ఆశతో యాసంగిలో దొడ్డరకం ధాన్యం సాగు చేసే రైతులు కూడా సన్నరకం ధాన్యాన్ని సాగుచేశారు. దీంతో వానాకాలం ధాన్యానికి కంటే అధికంగా యాసంగిలో కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. కానీ నేటికీ బోనస్ డబ్బులు జమ చేయకపోవడంతో రైతులు నిరాశలో ఉన్నారు.

జమ చేయాల్సిన బోనస్..

యాసంగిలో రైతుల ఖాతాలలో జమ చేయాల్సిన బోనస్ డబ్బులు దాదాపు రూ.50 కోట్లు ఉంటుంది. గద్వాల జిల్లాలో యాసంగిలో 63 వేల ఎకరాలలో సన్నాల సాగుచేశారు. వానాకాలంలో బోనస్ డబ్బులు వెంటనే జమ చేసినందుకు యాసంగి పంట మొత్తం కొనుగోలు కేంద్రాలకు తరలించారు. దాదాపుగా 10 లక్షల క్వింటాళ్ల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రూ. 232 కోట్ల విలువ చేసే ధాన్యాన్ని రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన 15,136 మంది రైతులు బోనస్ కోసం ఎదురు చూస్తున్నారు.

చాలా ఇబ్బంది పడ్డాం..


యాసంగి ధాన్యానికి సంబంధించి బోనస్ డబ్బులు అందక వానాకాలం పంట పెట్టుబడికి చాలా ఇబ్బంది పడ్డాం. 175 క్వింటాళ్ల ధాన్యాన్ని విక్రయించాను. బోనస్ డబ్బులు రూ. 87,500 అందాల్సి ఉంది. ఈ డబ్బులు జమ చేయకపోవడంతో పెట్టుబడి కోసం వడ్డీకి తెచ్చాను. ప్రభుత్వం వెంటనే బోనస్ డబ్బులు జమ చేయాలి.

-నర్సింహులు, కేశవరం

బోనస్ రూ.1.47లక్షలు రావాలి


గత యాసంగిలో 295 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాను. తనకు రూ.1.47 లక్షలు బోనస్ కింద రావాల్సి ఉంది. నేటికీ ప్రభుత్వం ఇవ్వలేదు. వానాకాలం పెట్టుబడి కోసం అప్పు చేశాను. ఇప్పుడు యాసంగికీ అప్పు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి త్వరలో బోనస్ డబ్బులు ఇవ్వాలి.

- రంగస్వామి, పులికల్

త్వరలో జమ చేస్తాం..


యాసంగి ధాన్యానికి సంబంధించి బోనస్ డబ్బులు త్వరలో అందే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా రైతులకు చెల్లించాల్సిన బోనస్ డబ్బుల వివరాలు ప్రభుత్వానికి అందజేశాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. త్వరలో రైతుల బ్యాంకుల ఖాతాలో జమ అవుతాయి.

- అవుల స్వామికుమార్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

పీయూ అభివృద్ధికి రూసా తోడ్పాటు

- వేతనాలకే సరిపోతున్న రాష్ట్ర ప్రభుత్వ నిధులు
- వందల కోట్లు కేటాయించినా విడుదల కాక ఇబ్బందులు
- ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 47 కోట్ల కేటాయింపు



పాలమూరు యూనివర్సిటీ పరిపాలనా భవనం

7

'యువకుడి వేధింపుల వల్లే.. నా బిడ్డ ఆత్మహత్య'

- ప్రియాంక తల్లిదండ్రుల ఆవేదన
- మృతదేహంతో మల్దకల్‌లో ధర్నా


ప్రియాంక మృత దేహంతో ధర్నా చేస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

7

శ్రీశైలం ప్రాజెక్టుకు మరింత తగ్గిన వరద

- కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

6

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

- రెండో రోజు కొనసాగిన హాస్టల్ వర్కర్ల నిరవధిక దీక్షలు

6



సమావేశంలో మాట్లాడుతున్న పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్యకర్తలే పార్టీకి సుప్రీం

- వారి అభిప్రాయాల మేరకే జిల్లా అధ్యక్ష ఎన్నిక
- ఏఐసీసీ పరిశీలకుడు, పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి

వనపర్తి/వనపర్తిటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలే పార్టీకి సుప్రీం అని, వారి అభిప్రాయం మేరకే జిల్లా అధ్యక్ష ఎన్నిక జరుగుతుందని ఏఐసీసీ పరిశీలకుడు, పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఎంపీ మల్లురవి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డిలతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష ఎన్నికలు గతంలో మాదిరిగా కాకుండా ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకునేలా పార్టీ మార్పులు తీసుకొచ్చిందన్నారు. అధ్యక్ష ఎన్నిక కోసం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో అభిప్రాయాలు స్వీకరిస్తామన్నారు. పార్టీ నియమాల ప్రకారంగానే ఎన్నిక జరుగుతుందని, ఎవరు అపోహకు గురికావద్దన్నారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లాలకు నూతన డీసీసీ అధ్యక్షుడి ఎంపిక కోసం తనను పార్టీ జాతీయ నాయకులు పంపించారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడ్డవారికే పదవులు వస్తాయని, పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్టం చేసుకున్నప్పుడే ఎన్నికల్లో తగిన ఫలితాలు సాధిస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడి కోసం దరఖాస్తులు స్వీకరించిన తరువాత ఒక్కొక్కరితో విడివిడిగా అభిప్రాయం సేకరిస్తానని, ఈనెల 22న పీసీసీ ముందు దరఖాస్తులు పెట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సిద్ధాంతాలతో పని చేయాలని, 10 సంవత్సరాలు పార్టీ కోసం కష్టపడ్డవారికే డీసీసీ పదవి ఇవ్వాలని ఆయన తన అభిప్రాయాన్ని తెలిపారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. బాకీ కార్డుతో వస్తున్న బద్మాష్‌గాళ్లకు గతంలో వారు విస్మరించిన హామీలను ప్రజలకు వివరించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎవరు ఎన్నికైనా కలిసి పనిచేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాహుల్‌రెడ్డి, అబ్జర్వర్ అహ్మద్ అమీర్ అలీఖాన్, శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌ప్రసాద్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపు గవర్నర్ రాక

- పీయూ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశాం
- 12 మందికి పీహెచ్‌డీ పట్టాలు, 71 మందికి బంగారు పతకాలు, 33,577 మందికి డిగ్రీ పట్టాలు అందజేత
- వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్



మాట్లాడుతున్న వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పీయూలో ఈనెల 16న జరిగే నాల్గో స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రానున్నారని యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం వర్సిటీలోని ఫార్మసి ఆడిటోరియంలో రిజిస్ట్రార్ పూస రమేశ్ బాబు, పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ ప్రవీణతో కలిసి శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమానికి ఎంఎస్ఎన్ గ్రూప్‌ఆఫ్ కంపెనీ చైర్మన్ డాక్టర్ మన్నె సత్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, గౌరవ డాక్టరేట్ అందుకోనున్నారని చెప్పారు. స్నాతకోత్సవ ఉపన్యాసం ఇస్తారన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన 12 మందికి పట్టాలను, 71 మందికి బంగారు పతకాలను, యూజీ, పీజీ డిగ్రీలను 33,577 మంది విద్యార్థులకు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. 2008లో ప్రారంభించిన వర్సిటీ అత్యున్నత ప్రమాణాలతో ముందుకెళ్తుందన్నారు. ఇప్పటికే న్యాక్ గుర్తింపుతో మూడు స్నాతకోత్సవాలను పూర్తి చేసుకుందన్నారు. ఏడు ప్రత్యేక కమిటీల ద్వారా స్నాతకోత్సవానికి అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు.

రిహార్సల్ : స్నాతకోత్సవానికి పీయూ అధికారులు, కమిటీ సభ్యులు వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పూస రమేష్ బాబు సమక్షంలో లైబ్రరీ ఆడిటోరియంలో రిహార్సల్స్ చేశారు. చాన్సలర్‌గా గవర్నర్‌ను, ముఖ్య అతిథిని, స్వాగతించే విధానం, సమవేశం నిర్వహణ, పీహెచ్‌డీ పట్టాలు, బంగారు పతాకలు, సీట్ల కేటాయింపుపై రిహార్సల్ చేశారు. కార్యక్రమంలో పీయూ ఉన్నతాధికారులతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జోరుగా వేరుశనగ సాగు


ట్రాక్టర్ సాయంతో విత్తనాలు వేస్తున్న రైతు

- పుష్కలంగా భూగర్భజలాలు
- ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న వేరుశనగ విత్తనాలు
- జిల్లాలో సాగు అంచనా 1,32,870 ఎకరాలు

అచ్చంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వరి, మొక్కజొన్న మినహాయిస్తే అన్ని పంటలు దెబ్బతిన్నాయి. అధిక వర్షాలు రైతులకు నష్టాన్ని మిగిల్చాయి. దీంతో రైతులు యాసంగి సాగుపైనే ఆశలు పెట్టుకున్నారు. భూగర్భ జలాలు పుష్కలంగా ఉండటంతో పాటు ప్రభుత్వం వేరుశనగ విత్తనాలు ఉచితంగా అందిస్తోంది. దీంతో ఈ ఏడాది నాగర్‌కర్నూల్ జిల్లాలో వేరుశనగ సాగు విస్తీర్ణం పెరగనుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

జిల్లాలో పెరుగనున్న సాగు విస్తీర్ణం

నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రధాన జలాశయాలతో పాటు చెరువులు, కుంటలు పొంగి పొర్లుతున్నాయి. ఈ నేపథ్యంలో యాసంగిలో వేరుశనగ సాగు అధిక విస్తీర్ణంలో సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. వర్షాకాలంలో వచ్చిన నష్టాన్ని యాసంగి సాగుతో గట్టెక్కుతామని రైతులు ఉత్సాహంగా సాగు చేస్తున్నారు. గతేడాది 1 లక్ష 30 వేల 902 ఎకరాలలో సాగు చేయగా ఈ ఏడాది 1లక్ష 32 వేల 870 ఎకరాలలో సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. అచ్చంపేట డివిజన్‌లో ఇప్పటికే వేరుశనగ విత్తనాలు వేశారు. అక్టోబరు చివరి నాటికి విత్తే పనులు పూర్తి చేయనున్నారు. వేరుశనగ సాగుతో పాటు మొక్కజొన్న సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

అధిక దిగుబడులు వచ్చే విత్తనాలు

అధిక దిగుబడి వచ్చే కే-6, ట్యాగు-24, కదిరి, లేపాక్షి, రకాలైన వేరుశన విత్తనాలను వాడుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలలో 1 లక్ష 58 వేల 504 క్వింటాల వేరుశనగ విత్తనాలు అవసరం ఉండగా ప్రస్తుతం మార్కెట్‌లో 34 వేల 626 క్వింటాళ్ల విత్తనాలు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే రైతులు కమీషన్ వ్యాపారుల నుంచి క్వింటాలు రూ. 12,500 నుంచి రూ.13,500 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. రైతు ఒక ఎకరం వేరుశనగ సాగు చేయాలంటే దాదాపు రూ.35 వేలకు పైగా ఖర్చు వస్తోందని వాపోతున్నారు.

ఉచితంగా వేరుశనగ విత్తనాల పంపిణీ

నేషనల్ మిషన్ ఆన్ ఈడబుల్ ఆయిల్స్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా మంగళవారం అచ్చంపేట డివిజన్‌లో 7,500 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను అధికారులు పంపిణీ చేశారు. ఈ పథకం ద్వారా ఎస్సీ కేటగిరి రైతులకు 16శాతం ఎస్టీ రైతులకు 10శాతం జనరల్ కేటగిరి రైతులకు 74శాతం ఉచితంగా పంపిణీ చేశారు. రైతుల ఎంపిక ప్రక్రియను రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఎఫ్‌పీవోకు అప్పగించారు.

పిల్లలను పత్తి చేలకు తీసుకెళ్తే కేసులు

- 22 మంది బాలలకు విముక్తి
- తెలకపల్లి ఎస్ఐ నరేశ్


వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు, పోలీసులు

7

శుభకార్యానికి వెళ్లి వచ్చే లోపు రెండు ఇళ్లలో దొంగతనం

- వెండి, బంగారు నగల చోరీ
- అలంపూర్ చౌరస్తాలో ఘటన

6

బ్లాక్ లిస్టులో పెడతాం

- సీఎంఆర్ అప్పగించకపోతే కఠిన చర్యలు
- మిల్లర్లను హెచ్చరించిన అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్


అధికారులు, మిల్లర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

వనపర్తి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గత వానాకాలం, యాసంగి సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ అప్పగించాలని, లేకపోతే బ్లాక్‌లిస్టులో పెడతామని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ రైస్ మిల్లర్లను హెచ్చరించారు. మంగళవారం ఆయన చాంబర్‌లో సివిల్ సప్లయ్ అధికారులు, రైస్ మిల్లర్లతో సమావేశాన్ని నిర్వహించారు. గత వానాకాలం సీజన్‌లో రైతుల నుంచి సేకరించి మిల్లర్లకు అప్పగించిన ధాన్యం ఎంత..? ఇప్పటి వరకు మిల్లర్లు ఎంత బియ్యం అప్పగించారు అనే అంశంపై సమీక్షించారు. 2024-25 వానాకాలం సీజన్‌లో జిల్లాలోని మిల్లర్ల నుంచి రావాల్సిన సీఎంఆర్ ధాన్యం 95,909 మెట్రిక్ టన్నులు కాగా ఇప్పటి వరకు 80,815 మెట్రిక్ టన్నులు మాత్రమే అప్పగించారు. ఇంకా 15,094 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది. యాసంగి సీజన్‌కు సంబంధించి 1,57,796 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 61,710 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే అప్పగించారు. ఇంకా 96,697 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్ల నుంచి రావాల్సి ఉంది. వానాకాలం సీజన్ బియ్యం అప్పగించాల్సిన గడువును నవంబరు 12 వరకు పొడిగించిన నేపథ్యంలో వెంటనే అప్పగించాలని సూచించారు. బియ్యం నాణ్యతగా ఉండాలని, లేని పక్షంలో రిజెక్టు చేయడం జరుగుతుందన్నారు. రెండు సీజన్‌లకు సంబంధించిన బియ్యాన్ని మిల్లింగ్ ఆడించి అప్పగించాలని ఆదేశించారు. గడువులోగా అప్పగించకుంటే బ్లాక్ లిస్టులో పెట్టడమే కాకుండా రెవెన్యూ రికవరీ యాక్టు ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి విశ్వనాథ్, సివిల్ సప్లయ్ అధికారి జగన్మోహన్, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీలకు.. పర్యవేక్షణ బృందాలు

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు.. ఉపాధ్యాయుల్లో బోధనా నైపుణ్యాల పరిశీలన

- ఉమ్మడి జిల్లాలో 2,947 బడులకు 37 బృందాల ఏర్పాటు
- కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఈవోలకు ఎంపిక బాధ్యత



గండీడ్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సర్కార్ బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను, ఉపాధ్యాయుల్లో బోధనా నైపుణ్యాలను పరి శీలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి. తనిఖీ చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా ప్రతీ జిల్లాలో సబ్జెక్టు నిపుణులతో పాఠశాలల సంఖ్య ఆధారంగా తనిఖీ బృందాలను నియమించనున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 37 పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయనున్నారని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో 2,947 పాఠశాలలు ఉన్నాయి. అందులో ప్రాథమిక పాఠశాలలు 1973, ప్రాథమికోన్నత పాఠశాలలు 438, ఉన్నత పాఠశాలలు 536 ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల తనిఖీ కోసం 20 బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల తనిఖీ కోసం ఐదు, ఉన్నత పాఠశాల తనిఖీ కోసం 12 బృందాలను నియమించ నున్నారు.

తనిఖీ బృందాలు ఇలా..

- ఉన్నత పాఠశాలలకు సంబంధించిన తనిఖీ బృందాల్లో 9 మంది సభ్యులు ఉంటారు. అందులో నోడల్ అధికారిగా సీనియర్ గజిటెడ్ హెచ్ఎం ఉంటారు. గణితం, సాంఘిక, భౌతిక, రసాయన, జీవ శ్రాస్తలు, ఇంగ్లిష్, తెలుగు, హిందీ, పీడీలు, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు.
- ప్రాథమికోన్నత పాఠశాలల తనిఖీ బృందాల్లో స్కూల్ అసిస్టెంట్ నోడల్ అధికారిగా, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సీనియర్ సెకండరి గ్రేడ్ టీచర్ సభ్యులుగా ఉంటారు.
- ప్రాథమిక పాఠశాల తనిఖీ కోసం జిల్లా స్థాయిలో ముగ్గురితో బృందాన్ని

మిగతా 7లో..

కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీలు

తనిఖీ బృందాల కమిటీలను కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణలో నియమిస్తారు. ఆ జిల్లాలో ఉన్న పాఠశాలలకు అనుగుణంగా తనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తారు. ప్రతీ మూడు నెలల్లో ఒక్కో బృందం జిల్లాలోని ఉన్న 50 పాఠశాలలను తనిఖీ చేయాల్సి ఉంటుంది. ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలకు సంబంధించిన బృందాలు మాత్రం 100 పాఠశాలలను తనిఖీ చేయాలి. అక్కడి పరిస్థితులను, విద్యార్థులకు అందుతున్న బోధన అంశాలను ఉన్నతాధికారులకు తెలియజేయాల్సి ఉంటుంది.

ఈ అర్హతలు తప్పనిసరి

పాఠశాల విద్యాశాఖ సూచించిన విధంగా పర్యవేక్షణ కమిటీలో ఉండే ఉపాధ్యాయులకు పదేళ్ల పాటు బోధన చేసిన అనుభవం ఉండాలి. సంబంధిత సబ్జెక్టులో అనర్గళంగా పాఠ్యంశ ప్రదర్శన ఇవ్వగలగాలి. విద్యాశాఖ నిర్వహించిన శిక్షణల్లో పాల్గొన్న వారికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఉపాధ్యాయుడికి భావ వ్యక్తీకరణ నైపుణ్యాలతో పాటు, కంప్యూటర్, చక్కని చేతిరాత వంటివాటిలో ప్రావీణ్యం ఉన్న వారికి అవకాశం కల్పిస్తారు.

శుభకార్యానికి వెళ్లి వచ్చే లోపు
రెండు ఇళ్లలో దొంగతనం

- వెండి, బంగారు నగల చోరీ
- అలంపూర్ చౌరస్తాలో ఘటన



చోరీ జరిగిన ఇంట్లో బాధితుడితో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న సీఐ రవిబాబు, ఎస్ఐ శేఖర్

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లకు తాళం వేసి శుభకార్యానికి వెళ్లి వచ్చే లోపు దొంగలు చొరబడి, వెండి, బంగారు నగలు దోచుకెళ్లారు. జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూర్ చౌరస్తాలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉండవెల్లి మండల పరిధిలోని పుల్లూరు గ్రామానికి చెందిన శ్రీధర్ అనే వ్యక్తి అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెనుకనున్న ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అదే ఇంట్లోని మరో పోర్షన్‌లో అలంపూరు మండలం సింగవరం పంచాయతీ కార్యదర్శి అద్దెకు ఉంటున్నారు. రెండు కుటుంబాల వారు కర్నూలు నగరంలో జరిగిన శుభకార్యానికి మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు వెళ్లి, మూడు గంటలకు తిరిగి వచ్చారు. అప్పటికే రెండు ఇళ్ల తాళాలు పగుల గొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి పరిశీలించారు. శ్రీధర్ ఇంట్లో రూ.1 లక్ష, 4.5 గ్రాముల బంగారం, రాజశేఖర్ ఇంట్లో కొంత వెండి, మొబైల్ పోన్ చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఉండవెల్లి ఎస్ఐ శేఖర్, సీఐ రవిబాబు, క్లూస్ టీంతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి, ఆధారాలు సేకరించారు. దొంగలు వెనుక గోడ మీద నుంచి ఇంట్లోకి చొరబడినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

దొంగలకు దేహశుద్ధి

- పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు
- సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్

గట్టు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఓ ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలకు గ్రామస్థులు దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. ఆదివారం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. జోగుళాంబ గద్వాల బల్గెర గ్రామానికి చెందిన ఆంజనేయులు ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి పొలానికి వెళ్లారు. ఇద్దరు వ్యక్తులు వారి ఇంటి తాళం విరగ్గొట్టి 2 తులాల బంగారం, 8 తులాల వెండి, రూ. 5వేలు చోరీ చేశారు. వారిలో ఒకరు గ్రామంలో తిరుగుతుండగా గ్రామస్థులకు అనుమానం వచ్చి పట్టుకొని నిలదీయడంతో చోరీ చేసినట్లు అంగీకరించాడు. మరో దొంగ ఎక్కడున్నాడో చెప్పడంతో అతడిని కూడా తీసుకొచ్చారు. ఇద్దరికీ దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వారిని చింతలకుంటకు చెందిన మహేశ్, కర్ణాటకలోని ఉండ్రాల్‌దొడ్డి గ్రామానికి చెందిన దౌలన్నలుగా గుర్తించారు. మహేశ్‌పై గతంలోనూ చోరీ కేసులున్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని, విచారణ చేపట్టినట్లు ఎస్ఐ కేటీ మల్లేశ్ తెలిపారు.

ప్రధానోపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసు

- జారీ చేసిన డీఈవో ప్రవీణ్‌కుమార్
- భోజనంలో జెర్రి ఘటనపై స్పందన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, బాదేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళతో పాటు, అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ఈనెల 10న మధ్యాహ్న భోజనంలో తాటి జెర్రి వచ్చిన సంఘటనపై ఆయన స్పందించారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ వంట గదులు, పరిసరాలను పరిశీలించి శుభ్రం చేయించినట్లు తెలిపారు. అలాగే పాఠశాలతో పాటు పరిసరాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యా యుడు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, పారిశుధ్య నిర్వహణపై సూచనలు, సలహాలు ఇచ్చినట్లు తెలిపారు. వారు వివరణ ఇచ్చిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు మరింత తగ్గిన వరద

- కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

గద్వాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు తగ్గిపోవడంతో కృష్ణా ప్రాజెక్టులకు వరద మరింత తగ్గిపోయింది. దీంతో ప్రాజెక్టుల గేట్లు మూత పడ్డాయి. మంగళవారం వరద మరింతగా తగ్గి 54 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు గేట్లను మూసివేసి విద్యుత్ ఉత్పత్తిని మాత్రం కొనసాగిస్తున్నారు. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 65,246 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు, మరో 15 వేల క్యూసెక్కుల నీటిని ఎత్తిపోతల పథకాలకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 209.59 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల గేట్లు కూడా మూత పడటంతో జూరాల జలాశయానికి 36 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే నమోదవుతోంది. ఈ ప్రాజెక్టు గేట్లను కూడా మూసివేసి విద్యుత్ ఉత్పత్తి ద్వారా 31,122 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర నుంచి సుంకేసుల డ్యామ్‌కు 6 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 3 వేల క్యూసెక్కుల నీటిని శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

60 ట్రాక్టర్ల ఇసుక డంపు పట్టివేత



మాన్‌దొడ్డి గ్రామంలో ఉసుక డంపులను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

రాజోలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండల పరిధిలోని మాన్‌దొడ్డి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 60 ట్రాక్టర్ల ఇసుక డంపును గుర్తించి సీజ్ చేసినట్లు తహసీల్దార్ రామ్మోహన్ తెలిపారు. గ్రామ శివారులోని తుంగభద్ర నది నుంచి అనుమతి లేకుండా ఇసుకను తీసుకొచ్చి గ్రామంలో డంప్ చేసినట్లు చెప్పారు. విశ్వసనీయ సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు గ్రామంలో తనిఖీ చేసి, వేర్వేరు చోట్ల డంప్ చేసిన ఇసుకను సీజ్ చేసినట్లు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇసుకను నిల్వ చేసినట్లు చెప్పారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులతో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ డాక్టర్ శారదాబాయి తదితరులు

- ఎస్‌జీఎఫ్ కార్యదర్శి డాక్టర్ శారదాబాయి
- ఉమ్మడి మహబూబ్‌నగర్ ఆర్చరీ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ శారదాబాయి అన్నారు. రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 ఆర్చరీ టోర్నీలో పాల్గొననున్న ఉమ్మడి పాలమూరు జిల్లా బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలను మంగళవారం స్థానిక స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలుర విభాగంలో 9 మంది, బాలికల విభాగంలో 5 మంది విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీజీపీడీ, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్, పేటాటీఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, రామ్‌కళ్యాణ్, శిక్షకుడు జ్ఞానేశ్వర్ మరియు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో
ఉమ్మడి జిల్లా బాలికల జట్టు విజయం



అండర్-19 రాష్ట్రస్థాయి కబడ్డీ విజేత ఉమ్మడి మహబూబ్‌నగర్ బాలికల జట్టు

- రన్నర్‌గా నిలిచిన బాలుర జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లాలో ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థా యి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల, బాలికల కబడ్డీ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ బాలికల జ ట్టు విజయ కేతనం ఎగురవేసింది. బాలుర జట్టు రన్నర్‌గా నిలిచింది. జిల్లా జట్ల విజయంపై డీఐ ఈవో కౌసర్ జహన్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి డాక్టర్ శారదాబాయి, కబడ్డీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా కబడ్డీ, చెస్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కబడ్డీ, చెస్ ఎంపిక పోటీలు ఉ త్సాహపూరిత వాతావరణంలో కొనసాగాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాలమూ రు పట్టణంలోని స్టేడియంలో మంగళవారం ఈ పోటీలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదాబా యి ప్రారంభించారు. అండర్-14 బాల, బాలికల కబడ్డీ టోర్నమెంట్ కమ్ ఎంపికలు, అండర్-14, 17, 19, చెస్ జట్ల ఎంపికలు నిర్వహించారు. కబడ్డీ బాలుర విభాగంలో దేవరకద్ర ప్రథమ, మహ మ్మదాబాద్ ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. బాలిక ల విభాగంలో అడ్డాకుల ప్రథమ, మహమ్మదాబాద్ ద్వితీయ స్థానాలను సొంతం చేసుకున్నాయి.



కబడ్డీ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన దేవరకద్ర బాలికల జట్టు

పిల్లలు కావాలని వెళితే...
మందుల్లేని రోగాన్ని అంటగట్టారు

- హెచ్‌బీఎస్ఏజీ లేకున్నా ఉన్నట్లు రిపోర్టు
- వివేక్ గ్యాస్ట్రో ఆసుపత్రి ప్లాస్మా ల్యాబ్ నిర్వాకం

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి) : వివాహమై ఏళ్లు గడుస్తున్నా పిల్లలు కావడం లేదని ఓ వ్యక్తి సంతాన సాఫల్య కేంద్రానికి వెళ్తే, లేని రోగాన్ని అంటగట్టారు. అది హెచ్‌బీఎస్ఏజీ (హెపటైటిస్ బి సర్ఫేస్ యాంటిజన్) పాజిటివ్ అని తేల్చారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన అతడు ఆ రిపోర్టుపై నమ్మకం లేక, మరో ప్రైవేటు ల్యాబుతో పాటు ప్రభుత్వ ఆసుపత్రి ల్యాబ్‌లో కూడా పరీక్ష చేయించుకోవడంతో నెగటివ్ అని తేలింది.

మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన రాజుకు వివాహమై ఎనిమిదేళ్లయినా పిల్లలు కలుగలేదు. దీంతో జిల్లాకేంద్రంలోని వివేక్ గ్యాస్ట్రో ఎంటాలజీ ఆసుపత్రిలో ఉన్న టీనా సంతాన సాఫల్య కేంద్రానికి వెళ్లారు. అన్ని పరీక్షలు చేసి, ఆయనకు హెచ్‌బీఎస్ఏజీ (హెపటైటిస్-బి) వ్యాధి ఉన్నట్లు రిపోర్టులు ఇచ్చారు. అంతేకాకుండా డాక్టర్ నితీష అతడి భార్యను పిలిచి, అతడికి భయంకరమైన వ్యాధి సోకిందని, శారీరకంగా దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఉందని చెప్పారు. ఈ వ్యాధికి తమ ఆసుపత్రిలోనే చికిత్స ఉందని, రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. అయితే ఆ రిపోర్టులపై నమ్మకం లేని రాజు, హైదరాబాద్‌లోని విజయ డయాగ్నోస్టిక్ సెంటర్, అపోలో ఆసుపత్రిలోని డయాగ్నోస్టిక్ సెంటర్‌లలో హెచ్‌బీఎస్ఏజీ పరీక్ష చేయించగా, నెగటివ్ రిపోర్టు వెచ్చింది. చివరకు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్లోనూ పరీక్ష చేయించగా అక్కడ కూడా నెగటివ్ రిపోర్టు వచ్చింది. దీంతో టీనా సంతాన సాఫల్య కేంద్రంలో తప్పుడు రిపోర్టు ఇచ్చినట్లు నిర్ధారించుకున్నాడు.

డబ్బులు దండుకోవడానికే..

హెచ్‌బీఎస్ఏజీ వ్యాధికి మందులు లేవు. నయం అయ్యే అవకాశం కూడా లేదు. శారీరకంగా కలిస్తే వారికి కూడా భాగస్వామికి కూడా సోక ప్రమాదముంది. అయితే కొన్ని రకాల మందులు, వ్యాక్సీన్లతో వ్యాధి వైరస్ వృద్ధి చెందకుండా సాధారణ స్థితిలో ఉండేందుకు వీలవుతుంది. ఇదే అవకాశంగా భావించిన ఆసుపత్రి యాజమాన్యం, తప్పుడు రిపోర్టు ఇచ్చి, డబ్బులు దండుకునేందుకు సిద్ధమైందని బాధితులు ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి

లేనిపోని రోగాన్ని అంటగట్టి నన్ను, నా భార్యను మానసిక క్షోభకు గురిచేశారు. ఈ అవమానంతో ఏదైనా చేసుకుంటామనే భయానికి లోనయ్యాము. ఇదే పరిస్థితి మరెవరికీ రావొద్దనే ఉద్దేశంతో మేము బయటికి వచ్చి వారి నిర్వాకాన్ని బయట పెట్టాం. వారిని వదిలే ప్రసక్తే లేదు. చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలి.

- రాజు, బాధితుడు

వైద్య సిబ్బంది పాత్ర కీలకం



మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

- జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ రంగా అజ్మీర

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి) : వైద్య రంగం అభివృద్ధిలో సిబ్బంది పాత్ర కీలకమని జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీర అన్నారు. మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన మధుసూదన్‌రెడ్డికి ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని మంగళవారం జనరల్ ఆసుపత్రిలోని సమావేశమందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ వైద్య ఉద్యోగులు బాధ్యతతో పనిచేసి జిల్లాకు రాష్ట్ర స్థాయిలో మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. వైద్యులపై భౌతికదాడులు అధికం అవుతున్నాయని, వాటిని ముక్తకంఠంతో ఖండించాలన్నారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యరంగంలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మిక సంక్షేమానికి ప్రత్యేక సమగ్ర విధానాన్ని ప్రకటించాలని కోరారు. అనంతరం వైద్య ఉద్యోగులు ఆయనను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, జనరల్ ఆసుపత్రి అనిస్తీషియా విభాగాధిపతి డాక్టర్ మాధవి, ఏవో డాక్టర్ ప్రేరణ, ఆర్ఎంవోలు, నర్సింగ్ సూపరింటెండెంట్ అల్వీన, తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వర్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్, కిశోర్, భాస్కర్, వరప్రసాద్, తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ పాల్గొన్నారు.

చెస్‌తో మేధోశక్తి పెంపు

- జోగుళాంబ గద్వాల డీవైఎస్‌వో కృష్ణయ్య

గద్వాల అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : చెస్ ఆడటం వల్ల విద్యార్థులు మేధాశక్తిని పెంచుకోవచ్చని డీవైఎస్‌వో కృష్ణయ్య అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఇన్‌డోర్ స్టేడియంలో మంగళవారం జిల్లాస్థాయి అండర్-14, 17, 19 విభాగాల్లో బాల, బాలికలకు చెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో మాట్లాడుతూ చెస్ ఆడటం వల్ల విద్యార్థుల మెదడుకు పదును పెట్టినట్లు అవుతుందన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ శ్రీనువాసులు మాట్లాడుతూ జిల్లాలోని 13 మండలాల నుంచి 165 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. వారిలో ప్రతిభ కనబరచిన 30 మంది క్రీడాకారులను జోనల్‌స్థాయికి ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు బీసన్న, నగేష్‌బాబు, పీఈటీలు పాల్గొన్నారు.



జోనల్ స్థాయికి ఎంపికైన క్రీడాకారులతో డీవైఎస్‌వో, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ

126 మొబైల్ ఫోన్ల రికవరీ

- నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్



బాధితురాలికి ఫోన్ అందిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 126 మంది పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు చెప్పారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని గుర్తించి, రికవరీ చేసి ఎస్పీ కార్యాలయంలో మంగళవారం బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి 4,487 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. అందులో 1,631 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. వాటి విలువ 2.5 కోట్లు ఉంటుందని తెలిపారు.

క్రీడాకారిణి అనన్యశ్రీకి
ముఖ్యమంత్రి అభినందనలు



అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారిణి అనన్యశ్రీని అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్/నర్వ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్‌కు చెందిన జాతీయ వాలీబాల్ క్రీడాకారిణి పుల్లారి అనన్యశ్రీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మంగళవారం ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. అనన్యశ్రీ సీనియర్ నేషనల్స్‌లో గోల్డ్, ఎఫ్ఐఎస్ వరల్డ్ యూనివర్సిటీ టోర్నీలో పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్, అనన్యశ్రీ తల్లిదండ్రులు పి.ఆనంద్, వరలక్ష్మి, ఆదిత్య సౌర్య పాల్గొన్నారు.

రాణించిన అబ్దుల్ రాఫె

- హెచ్‌సీఏ 2లీగ్ తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ



సెంచరీతో రాణించిన అబ్దుల్‌రాఫె

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన 2 లీగ్ టోర్నీలో జిల్లా జట్టు క్రీడాకారుడు అబ్దుల్ రాఫె రాణించాడు. హైదరాబాద్, మొయినబాద్‌లోని ఎస్ఆర్-1 క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న 2డే క్రికెట్ లీగ్‌లో మంగళవారం మహబూబ్‌నగర్ - బాలజీ క్లాట్స్ జట్లు తలబడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు మొదటి ఇన్నింగ్‌లో 76.5 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో అబ్దుల్ రాఫె 235 బంతుల్లో 23 ఫోర్లతో సెంచరీ (144) చేసి రాణించాడు. ఈ సందర్భంగా అతడిని క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్ అభినందించారు.

సత్తా చాటిన 'పేట' విద్యార్థిని

- రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



శిరీషను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దామరగిద్ద, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండల పరిధిలోని విఠలాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని శిరీష అండర్ -17 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తా చాటింది. మహబూబ్‌నగర్ జిల్లా, బాదేపల్లిలో జరిగిన ఉమ్మడి జిల్లా వాలీబాల్ టోర్నమెంట్‌లో శిరీష సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నాగిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో ఈనెల 16న నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

- రెండో రోజు కొనసాగిన హాస్టల్ వర్కర్ల నిరవధిక సమ్మె




మన్ననూరు ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన నిరవధిక సమ్మెలో పాల్గొన్న దినసరి కార్మికులు

మన్ననూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : దినసరి వేతనంపై హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్ల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శులు రాములు, శంకర్ నాయక్ అన్నారు. నాగర్‌కర్నూలు జిల్లా పరిధిలోని మన్ననూరు ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో హాస్టల్ వర్కర్లు చేపట్టిన 72గంటల నిరవధిక దీక్ష రెండో రోజు మంగళవారం కొనసాగింది. సోమవారం రాత్రి ఐటీడీఏ కార్యాలయ ఆవరణలోనే హాస్టల్ వర్కర్లు నిద్రించారు. పలువురు ప్రజా సంఘాల నాయకులు హాస్టల్ వర్కర్లు చేస్తున్న సమ్మెకు మద్దతుగా నిలచి ఆందోళనలో పాల్గొన్నారు. 33 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఆల్‌ఇండియా అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ సయ్యద్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, హాస్టల్ వర్కర్ల యూనియన్ నాయకులు సురేందర్, పర్వతాలు, ఓంప్రకాశ్, రవి నాయక్, భరత్, పద్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

పత్తిలో అంతరపంటలు వేసుకోవాలి

- రైతులకు రావేఫ్ విద్యార్థినుల సూచన



వ్యవసాయంలో స్వదేశీ సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థినులు

తిమ్మాజిపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులు పత్తి పంటలో అంతర పంటలు వేసుకోవడం ద్వారా తెగుళ్లను నివారించుకోవచ్చని వనపర్తి వ్యవసాయ కళాశాల విద్యార్థినులు ఝాన్సీ రాణి, హిమబిందు, అలేఖ్య, జానకి, ఉషశ్రీ, శిరీషలు సూచించారు. మండల పరిధిలోని గొరిట దేవాలయం ఆవరణలో మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేస్తూ స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించారు. వ్యవసాయంలో పూర్వీకులు అవలంబించిన మెళకువలను వాడకలోకి తీసుకురావాలని సూచించారు. జొన్న, మొక్కజొన్న వంటి అంతర పంటలు వేయడం ఆముదం విత్తనాలు, విత్తడం వల్ల పురుగులను ఆకర్షిస్తుందని, పత్తి పంటకు నష్టం జరగదన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల వ్యవసాయ అధికారుల సలహాలు పాటిస్తూ పంటలు వేసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



ఉప్పలక్యాంపులో దగ్ధమవుతున్న గుడిసె

అయిజ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండల పరిధిలోని ఉప్పల క్యాంపులో ఓ గుడిసె విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. గ్రామానికి చెందిన సరోజమ్మ సోమవారం రాత్రి తన గుడిసెలో నిద్రిస్తుండగా గుడిసెకు నిప్పంటుకున్నది. గమనించిన ఆమె భయంతో కేకలు వేస్తూ బయటకు పరుగు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. గుడిసెకు సమీపంలో విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం వల్ల షార్ట్‌సర్క్యూట్ అయి, గుడిసెపై నిప్పు రవ్వలు పడి మంటలు చెలరేగినట్లు బాధితురాలు తెలిపారు. తహసీల్దార్ జ్యోతి ఆదేశం మేరకు ఆర్ఐ రజనీకాంత్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం

ఆత్మకూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండల పరిధిలోని దేవరపల్లి శివారులోని జమ్ముడక చెరువులో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ నరేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం ఉదయం పొలాలకు వెళ్తున్న రైతులకు మృతదేహం కనిపించింది. వారు సమాచారం అందించడంతో పోలీసులకు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు 45 సంవత్సరాలు ఉండొచ్చని తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం

- లట్టుపల్లిలో వృద్ధుడు, శ్రీరంగాపూర్‌లో యువతి



వడ్ల రాములు (ఫైల్)

బిజినేపల్లి/శ్రీరంగాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో ఓ వృద్ధుడు, ఓ వివాహిత అదృశ్యం అయ్యారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. బిజినేపల్లి మండలంలోని లట్టుపల్లికి చెందిన వడ్ల రాములు(65) అనే వ్యక్తి ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గ్రామంతో పాటు, చుట్టు పక్కల ఊర్లు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా, ఆచూకీ తెలియలేదు. దీంతో ఆయన కుమారుడు కాసోజు చంద్రశేఖర్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అలాగే వనపర్తి జిల్లా, శ్రీరంగాపూర్‌లో ఓ యువతి మంగళవారం ఉదయం ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. ఈ విషయంపై ఆమె తండ్రి ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హిమబిందు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



విఠలాపూర్ శివారులో పోలీసులకు పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

దామరగిద్ద, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తర లిస్తున్న ట్రాక్టర్ పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. దౌ ల్తాబాద్ మండలం సుల్తాన్‌పూర్ తండాకు చెందిన శంకర్‌నాయక్ ప్రభుత్వ అ నుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా పేట జిల్లా దామరగిద్ద మండలం విఠలాపూర్ గ్రామ శివారులో పట్టుకొని స్టేషన్‌కు తరలించి కేసు న మోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

● నవాబ్‌పేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కురిసిన భారీ వర్షానికి కుంటలు, వాగులు, చిన్నచిన్న గుంతల్లోకి వచ్చిన ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న ఓ వ్యక్తిని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రం తెలిపారు. మంగళవారం మండలంలోని రుద్రారం గ్రామ సమీపంలో ఉదయం 9 గంటల ప్రాంతంలో పోలీసు సిబ్బంది గస్తీ నిర్వహిస్తుండగా హన్మసానిపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపు తప్పిన కారు

- పలు వాహనాలను ఢీకొని బోల్తా
- ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు

మరికల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఓ కారు అదుపుతప్పి టిప్పర్, టీవీఎస్, స్కూటీలను ఢీకొని బోల్తాపడింది. ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గా యాలయ్యాయి. నారాయణపేట జిల్లా, మరికల్ మండల పరిధిలోని పసుపుల స్టేజీ సమీపంలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు... మరికల్ నుంచి ఎల్లిగండ్ల వైపు వెళ్తున్న కారు ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా అదుపుతప్పింది. పెట్రోల్ బాంకు పక్కన ఆగి ఉన్న టిప్పర్‌ను, టీవీఎస్ ఎక్సెల్, స్కూటీలను ఢీకొని బోల్తాపడింది. ప్రమాదంలో స్కూటీపై కూర్చొని ఉన్న పసుపుల గ్రామానికి చెందిన తిరుమలయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రెండు వాహనాలు ఢీ

- వ్యక్తి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెలకపల్లి మండలం గడ్డంపల్లి గ్రామానికి చెందిన కాకునూరి శ్రీనివాసులు (56) మంగళవారం లూనాపై బిజినేపల్లి మండలంలోని ఖానాపూర్ గ్రామానికి వెళ్లి సాయంత్రం తిరిగి వస్తున్నాడు. పాలమూరు రంగారెడ్డి పథకంలో పని చేస్తున్న మస్తాన్‌వలీ అనే వ్యక్తి బైక్‌పై నాగర్‌కర్నూల్ నుంచి ప్రాజెక్టు వద్దకు వెళ్తున్నాడు. రెండు వాహనాలు నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ సమీపంలో ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ప్రమాదంలో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మస్తాన్‌ను జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

యువతి మృతిపై విచారణ



మంచాలకట్ట సమీపంలో, కృష్ణానది తీరాన పడిఉన్న యువతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం

పెంట్లవెల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పెంట్లవెల్లి మండలంలోని మంచాలకట్ట సమీపంలో, చింతరాయగుట్ట వద్ద కృష్ణానది తీరంలో సగం కాలిన యువతి మృతదేహం సోమవారం లభ్యమైంది. సంఘటనపై మంగళవారం పోలీసులు విచారణ చేపట్టారు. సంఘటనా స్థలాన్ని క్లూస్ టీం సభ్యుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పరిశీలించారు. మృతదేహంపై ఉన్న వస్తువులను సేకరించారు. అనంతరం డాక్టర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో పోస్టుమార్టం చేసి, మృతదేహాన్ని పూడ్చి వేశారు. కార్యక్రమంలో కొల్లాపూర్ సీఐ మహేశ్, పెంట్లవెల్లి ఎస్ఐ రామన్‌గౌడ్ పాల్గొన్నారు.

పీయూ అభివృద్ధికి రూసా తోడ్పాటు

- వేతనాలకే సరిపోతున్న రాష్ట్ర ప్రభుత్వ నిధులు
- వందల కోట్లు కేటాయించినా, విడుదల కాక ఇబ్బందులు
- ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 47 కోట్ల కేటాయింపు





పాలమూరు యూనివర్సిటీలో నిర్మాణంలో ఉన్న పరిశోధనా కేంద్ర భవనం

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలో పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధికి 'రూసా' (రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్) నిధులు తోడ్పడుతున్నాయి. యూనివర్సిటీకి రూసా రూ.20 కోట్లు కేటాయించగా, అందులో రూ.16 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. అలాగే గత ఏడాది పీయం ఉషా (ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్) ద్వారా రూ.100 కోట్లు కేటాయించారు. ఆ నిధులు విడతల వారీగా వస్తాయని ప్రభుత్వం ప్రకటించినా, ఇప్పటివరకు విడుదల కాలేదు. కానీ ఆ నిధులతో లా, ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించినట్లు అధికారులు చెప్తున్నారు. యూనివర్సిటీ ఏర్పాటైనప్పటి నుంచి 2017 - 18 ఎన్నికల సమయంలో మినహా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వేతనాలకు తప్ప అభివృద్ధికి నిధులు కేటాయించలేదని సమాచారం.

190 కోట్లకు ప్రతిపాదనలు

రాష్ట్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌లో దాదాపు రూ. 190 కోట్ల మేర ప్రతిపాదనలు పంపించగా, వేతనాల కోసం రూ. 12కోట్లు, యూనివర్సిటీ అభివృద్ధికి రూ.35 కోట్లు కేటాయించారు. మొత్తం రూ.47 కోట్లలో, వేతనాల నిధులు విడుదలైనా, అభివృద్ధి నిధులు మంజూరు కాలేదు. అలాగే కేంద్ర ప్రభుత్వం పీఎం ఉషా పథకం ద్వారా రూ.100 కోట్లు కేటాయించినా ఇప్పటివరకు పూర్తి స్థాయిలో విడుదల కాలేదు. రూసా నుంచి 2022లో రూ.20 కోట్ల కేటాయింపులకు గాను, రూ.16 కోట్లు విడుదలయ్యాయి. ప్రధాన క్యాంపస్‌తో పాటు కొల్లాపూర్, వనపర్తి, గద్వాల పీజీ కేంద్రాల్లో మొత్తం 3000 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. 18 మంది రెగ్యులర్ అధ్యాపకులు, 140 మందికి పైగా కాంట్రాక్ అధ్యాపకులు, 180 మందికి పైగా నాన్ టీచింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు వేతనాలకే సరిపోతున్నాయని అధికారులు చెప్తున్నారు.

పెండింగ్‌లో అభివృద్ధి పనులు

పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధికి సరిపడా నిధులు విడుదల కాకపోవడంతో అదనపు తరగతి గదులు నిర్మించలేకపోయారు. ఇప్పటికీ కొన్ని విభాగాలకు తరగతి గదులు లేకపోవడంతో షిఫ్టింగ్ పద్ధతిలో కొనసాగిస్తున్నారు. పరిశోధనా కేంద్ర భవన నిర్మాణానికి 2021లో శంకుస్థాపన చేసినప్పటికీ, పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. అలాగే లా, ఇంజనీరింగ్ కళాశాల భవనాలు, అదనపు తరగతి గదుల నిర్మాణం కూడా నిధుల కొరతతో నిలిచిపోయింది.

పాఠశాలల తనిఖీలకు పర్యవేక్షణ బృందాలు

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేస్తారు. అందులో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. మరో ముగ్గురు సీనియర్ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు.

జిల్లాల వారీగా బృందాలు

జిల్లాల వారీగా తనిఖీ బృందాలు ఏర్పాటు కానున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్నత పాఠశాలలు 138కి గాను మూడు బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలు 87 ఉండగా 1, ప్రాథమిక పాఠశాలలు 564 ఉండగా 6 బృందాలు ఏర్పాటు కాన్నున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉన్నత పాఠశాలలు 130కిగాను 3, ప్రాథమికోన్నత పాఠశాలలు 124గాను ఒకటి, ప్రాథమిక పాఠశాలు 498కి గాను 5, వనపర్తి జిల్లాలో ఉన్నత పాఠశాలలు 101కి గాను 2, ప్రాథమికోన్నత పాఠశాలలు 60కి గాను 1, ప్రాథమిక పాఠశాలలు 337కి గాను 3, నారాయణపేట జిల్లాలో ఉన్నత పాఠశాలలు 75కు గాను 2, ప్రాథమికోన్నత పాఠశాలలు 86కు గాను 1, ప్రాథమిక పాఠశాలలు 299కి గాను 3 బృందాలు ఏర్పాటు చేయనున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఉన్నత పాఠశాలలు 94కు గాను 2, ప్రాథమికోన్నత పాఠశాలలు 81కి గాను 1, ప్రాథమిక పాఠశాలు 275కి గాను 3 బృందాలు ఏర్పాటు కానున్నాయి.

గోరటి వెంకన్నకు 26న ఘన సన్మానం

- ఆయన స్వగ్రామం గౌరారంలో నిర్వహణ
- సభను విజయవంతం చేయాలి
- నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి



గోరటి వెంకన్న ఇంటి వద్ద ఎంపీ మల్లు రవి

తెలకపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ కవి, వాగ్గేయకారుడు గోరటి వెంకన్నకు ఇటీవల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది. అందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఈనెల 26న ఆయన స్వగ్రామం గౌరారంలో సన్మాన సభ నిర్వహించనున్నారు. వెన్నెల, సాహిత్య అకాడమీ, అరసం, నెలపొడుపు అకాడమీల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి తెలకపల్లి మండల పరిధిలోని గౌరారంలో గోరటి వెంకన్న ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ గోరటి వెంకన్నను సన్మానించుకోవడం చాలా సంతోషకరమన్నారు. అనంతరం సభ నిర్వహణపై గ్రామస్థులతో చర్చించారు. కవులు, కళాకారులు, మేధావులు, విద్యావంతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీ పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. గూడ చెరువు కాలువలకు మరమ్మతులు చేయిస్తామని, రెండో విడతలో గ్రామానికి ఇందిరమ్మ ఇళ్ల ఎక్కువగా మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, మాధవులు, వల్లపరెడ్డి, బండ పర్వతాలు, బోయ మల్లయ్య, కురుమూర్తి, సాంబశివుడు, వెంకటయ్య, రఘు, కుమార్, కురుమూర్తి, శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

దీపావళిపై సందిగ్ధం

- రెండు రోజుల పాటు అమావాస్య
- 21న జరుపుకోవాలంటున్న పురోహితులు

నారాయణపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగపై సందిగ్ధం నెలకొన్నది. ద్రుక్ సిద్ధాంత గణితం ప్రకారం దీపావళి అమావాస్య ఈ నెల 20న సోమవారం మధ్యాహ్నం 3.46 నిమిషాలకు ప్రారంభం అవుతుంది. మంగళవారం సాయంత్రం 5.55 నిమిషాల వరకు ఉంటుంది. తిథి రెండు రోజులు ఉండటంతో పండుగ ఎప్పుడు జరుపుకోవాలన్న ధర్మ సందేహం నెలకొన్నది. ధర్మసింధు గ్రంథ అధారంగా తొలి రోజు ప్రదోష సమయంలో అమావాస్య ప్రారంభమై, తరువాతి రోజు ప్రదోష సమయంలోనూ ఉంటే లక్ష్మీపూజలను ముందు రోజే చేసుకోవాలి. తరువాతి రోజు అభ్యంగన స్నానాలు, అమావాస్య పూజలు, దీపావళి పండుగ ఆచరించాలని శాస్త్రం చెప్తోంది. దీని ఆధారంగా చూస్తే 20వ తేదీ, సోమవారం లక్ష్మీపూజలు, 21న దీపావళి పండుగను జరుపుకోవాల్సి ఉంటుంది. పురుషార్థ చింతామణి ప్రకారం అమావాస్య తిథి 3 యామాల (యామం అంటే 3 గంటలు) కంటే ఎక్కువగా ఉంటే అదో రోజు పండుగ చేసుకోవాలి. తక్కువగా ఉంటే ముందు రోజే పండుగ జరుపుకోవాల్సి ఉంటుంది. ఈ నియమం ప్రకారం 21న మంగళవారం దీపావళి పండుగలను జరుపుకోవాలని నారాయణపేటకు చెందిన కృష్ణ యజుర్వేద పండితుడు ఊట్కూర్ శిభావసు పురోహిత్ తెలిపారు.

పిల్లలను పత్తిచేలకు తీసుకెళ్తే కేసులు

- 22 మంది బాలలకు విముక్తి
- తెలకపల్లి ఎస్ఐ నరేశ్



గౌరెడ్డిపల్లి సమీపంలో వాహనాలను తనిఖీ చేసి, పనులకు వెళ్తున్న పిల్లలకు విముక్తి కల్పించిన అధికారులు

తెలకపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బాల, బాలికలను పని కోసం పత్తి చేలకు తీసుకెళ్తే కేసులు నమోదు చేస్తామని తెలకపల్లి ఎస్ఐ నరేశ్ హెచ్చరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండల పరిధిలోని గౌరెడ్డిపల్లి సమీపంలో జిల్లా బాలల హక్కుల పరిరక్షణ కమిటీ, పోలీసు, విద్యా శాఖ అధికారులు, చైల్డ్ హెల్ప్‌లైన్, కోనేరు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పిల్లలను తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. 22 మంది బాలలకు విముక్తి కల్పించారు. అనంతరం కొల్లాపూర్ మండలంలోని మొలచింతలపల్లి, నార్లాపూర్, ముక్కిడిగుండం, పెద్దకొత్తపల్లి మండలంలోని సాతాపూర్, లింగాల మండలంలోని అంబటిపల్లి గ్రామాల్లో పర్యటించారు. విద్యార్థులను పనికి తరలిస్తున్న 8 వాహనాలను అడ్డుకున్నారు. వారందరినీ పాఠశాలలకు పంపించారు. పిల్లలను అక్రమంగా తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీసీపీయూ, యూనిట్ డీసీపీవో శ్రీశైలం, మధుబాబు, చైల్డ్ హెల్ప్‌లైన్ కేస్ వర్కర్ ప్రమీల, కోనేరు ఎన్జీవో స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఏరియా కోఆర్డినేటర్లు శ్రీనివాస్‌యాదవ్, జాకీర్‌హుస్సేన్, కల్పన, కానిస్టేబుల్ వెంకటేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

1104 యూనియన్ సబ్ డివిజన్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులను అభినందిస్తున్న యూనియన్ నాయకులు

పాలమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ మహబూబ్‌నగర్ సబ్-డివిజన్ కమిటీని మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సబ్-డివిజన్ అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా శివకిషోర్, కార్యదర్శిగా అశోక్ ఎన్నికయ్యారు. టౌన్-1 లీడర్‌గా మజర్, టౌన్-2 లీడర్‌గా గోవర్ధన్, టౌన్-3 లీడర్‌గా అజర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కంపెనీ నాయకులు సత్యం, సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు యాదయ్యగౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'యువకుడి వేధింపుల వల్లే.. నా బిడ్డ ఆత్మహత్య'

- ప్రియాంక తల్లిదండ్రుల ఆవేదన
- మృతదేహంతో మల్దకల్‌లో ధర్నా
- నిష్పక్షపాతంగా విచారణ చేయిస్తా
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హామీ



ప్రియాంక మృత దేహంతో ధర్నా చేస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

గద్వాల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : మల్దకల్‌కు చెందిన యువకుడు ప్రేమ పేరుతో వేధించడం వల్లే తన బిడ్డ ఆత్మహత్య చేసుకున్నదని ప్రియాంక తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని రామిరెడ్డిగూడలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ విద్యార్థిని ప్రియాంక సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నది. ఆమె మృతదేహం అర్ధరాత్రి సమయానికి స్వగ్రామమైన మల్దకల్ మండల కేంద్రానికి చేరుకున్నది.

ఈ సందర్భంగా తల్లిదండ్రులు, బంధువులు మల్దకల్ - అయిజ రహదారిపై గంటకు పైగా ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మల్దకల్‌కు చేరుకున్నారు. ప్రియాంక మృతదేహం వద్ద నివాళి అర్పించారు. తల్లిదండ్రులను ఓదార్చి, మాట్లాడారు. విద్యార్థిని ఆత్మహత్యపై నిష్పక్షపాతంగా విచారణ చేయిస్తామని, పోలీసులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు ధర్నా విరమించారు. అనంతరం మల్దకల్ ఎస్ఐ నందీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఫిర్యాదును కేసు నమోదైన పోలీస్ స్టేషన్‌కు పంపిస్తామని తెలిపారు.

కనుల పండువగా జ్యోతుల ఊరేగింపు



కోస్గి పట్టణంలో కొనసాగుతున్న జ్యోతుల ఊరేగింపు

కోస్గి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, కోస్గి పట్టణంలో చౌడేశ్వరీ మాత జ్యోతుల ఊరేగింపు భక్తులకు కనుల పండువ చేసింది. ఆలయంలో రెండు రోజులుగా ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం అమ్మవారి జ్యోతులతో ఆలయం నుంచి రామాలయం చౌరస్తా, శివాజీకూడలి మీదుగా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శశిధర్, బాల్‌రాజ్, గౌరీశంకర్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

వంగూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసగా మారి, ఆర్థిక ఇబ్బందులకు గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మహేశ్ గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండ లంలో మంగళవారం ఈ సంఘటన జరిగింది. తెలకపల్లి మండలంలోని ఆలేరు గ్రామానికి చెందిన సందరాజు నవీన్ (26), భార్య శ్రావణి దంపతులకు ఒక కుమార్తె ఉంది. వారు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో నివాసం ఉంటూ, కూలిపని చేసుకొని జీవిస్తున్నారు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన నవీన్ మూడు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. మంగళవారం కొండారెడ్డిపల్లి శివారులో, శ్రీశైలం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఓ దాబా వెనుకనున్న వేప చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా, వారు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై నవీన్ తల్లి తిరుపతమ్మ ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

- ఆరుగురిపై కేసు నమోదు

మరికల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ధన్వాడ మండలంలోని కంసాన్‌పల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టు కొని కేసు నమోదు చేసినట్లు ధన్వాడ ఇన్‌చార్జి ఎస్ఐ సురేష్ తెలిపారు. మంగళవారం రాత్రి కొంతమంది పేకాట ఆడుతున్నారన్న ముందస్తు సమాచారం మేరకు ధన్వాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఆరుగురు వ్యక్తులను పట్టుకొని వారి నుంచి రూ. 8200 నగదు, ఐదు బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆరుగు రిపై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఇంటర్వ్యూ..

గ్రామాల అభివృద్దే ధ్యేయం

● ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణమూర్తి



ధరూరు,అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పనులు పూర్తి చేసి, సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో మాట్లాడారు.

గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి చేపట్టారు?

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలతో పాటు వీధిలైట్లు, పారిశుధ్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పనులు చేస్తున్నాం.

తాగునీటి సమస్య ఉన్నదా?

మండలంలో 28 గ్రామ పంచాయతీలకు 48 గ్రామాలు ఉన్నాయి. ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్య లేదు. ఎలాంటి అంతరాయం లేకుండా మిషన్ భగీరథ నీటి సరఫరా కొనసాగుతున్నది.

గ్రామ కార్యదర్శుల పనితీరు ఎలా ఉంది?

ప్రస్తుతం సర్పంచులు లేనికారణంగా పని భారం ఉంది. గ్రామ కార్యదర్శుల పనితీరుపై ఉన్నతాధికారులు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎవరైనా పనుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటాం.

నూతన పెన్షన్లు ఇస్తున్నారా?

ప్రభుత్వం నుంచి నూతన పెన్షన్‌కు సంబంధించిన ఉత్తర్వులు రాలేదు. పాతపెన్షన్ వ్యవస్థను పూర్తిస్థాయిలో సక్రమంగా అమలు చేస్తున్నాం. వితంతు, వికలాంగుల పెన్షన్లు మాత్రమే కొత్తగా మంజూరు చేస్తున్నాం.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఎలా కొనసాగుతున్నది?

మండల పరిధిలో 600 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటికే 30శాతం మేర నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇప్పటికే లబ్ధిదారులకు రూ.లక్ష జమయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించి త్వరగా పూర్తిచేస్తాం.

న్యూస్ బాక్స్

వెలగని విద్యుత్ దీపాలు

అలంపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాత్రివేళలో వీధిలైట్లు వెలగక న్యూప్లాట్స్ కాలనీ వాసులు అంధకారంలో మగ్గుతున్నారని కేవీపీఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. మంగళవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో రెండవ రోజు కాలనీలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించారు. తక్షణమే స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 16న మునిసిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్నామని, దీక్షలో పట్టణప్రజలు అధికంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మౌలాలి, నరసింహ, జయన్న, విశ్వం పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించిన ఎస్ఐ



టిప్పర్‌తో రోడ్డుపై మొర్రం వేయిస్తున్న ఎస్ఐ శేఖర్

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నుంచి ఉండవల్లి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు అగమ్యగోచరంగా తయారైంది. దీంతో అటువైపు ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది ఉపడుతున్నారు. పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు ప్రజలు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇది గమనించిన స్థానిక ఎస్ఐ శేఖర్ ఎర్రమట్టి తెప్పించి గుంతలుపడ్డచోట మొర్రం వేయించి డోజరు సహాయంతో చదును చేయించారు.

మునగాల రోడ్డులో ముళ్లకంప తొలగింపు

ఇటిక్యాల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఇటిక్యాల మండలం మునగాల నుంచి ఎర్రవల్లికి వెళ్లే దారిలో ఇరువైపులా ముళ్లకంప పెరగడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు మలుపులు ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు, ప్రజలు ప్రమాదాలకు గురయ్యే అవకాశముందని ఇటిక్యాల ఎస్ఐ రవి ముందస్తుగా ముళ్లకంపను జేసీబీతో తొలగించారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

ఉండవల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయాగ్రామాల్లో ఈనెల 15 నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని మండల పశు వైద్యాధికారి డాక్టర్ సతీశ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి తెల్లపశువులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, పాడి యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సబ్సిడీ విత్తనాలు అందజేత

ఇటిక్యాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటిక్యాలలోని ఏవో కార్యాలయంలో మంగళవారం వంద శాతం సబ్సిడీపై రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఏవో రవికుమార్, ఏఈఓలు వెంకటేశ్, సంధ్య, కవిత, బీజేపీ మండల అధ్యక్షుడు షేక్ అబ్దుల్లాతో కలిసి రైతు సంఘం చైర్మన్ వీరారెడ్డి, యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు.

ఈహెచ్‌ఎస్ ద్వారా వైద్య సేవలకు కృషి

● ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

● ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం



శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ ద్వారా వైద్య సేవలు అందించేందుకు నావంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఈ ప్రాంతంలోని ప్రజలకు కర్నూలు, రాయచూరు జిల్లాకేంద్రాల్లో ఈహెచ్ఎస్ పథకం అమలుచేసే విధంగా కోరుతానని తెలిపారు. మంగళవారం పట్టణంలోని పాతహౌసింగ్ బోర్డు కాలనీలోని విశ్రాంత ఉద్యోగం సంఘం ఆధ్వర్యంలో, హైదరాబాద్ మణికొండలోని సుశీల నేత్రాలయం డాక్టర్ సుధాకర్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా శిబిరంలో ఎమ్మెల్యేకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే, త్వరలోనే విశ్రాంత ఉద్యోగుల కమిటీ హాల్ భవనం పనులు ప్రారంభించి అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు తనవంతు సహాయ సహకారం ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఉచిత కంటి వైద్యశిబిరంలో 80మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 12మందిని శస్త్రచికిత్స కోసం తరలించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ కురువ హనుమంతు, జిల్లా గ్రంథాలయం చైర్మన్ రామన్‌గౌడ్, వేణుగోపాల్, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, మాజీ కౌన్సిలర్ నరహరిగౌడ్, ఉరుకుందు, చంద్రశేఖర్, యుగంధర్‌గౌడ్, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి చక్రధర్ ఉన్నారు.

23న మద్యం దుకాణాల కేటాయింపు

● జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్‌రెడ్డి

గద్వాల క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): 2025-27 సంవత్సరానికి గాను జోగుళాంబ గద్వాల జిల్లాలోని 34 మద్యం దుకాణాలు(ఏ4) కేటాయింపును లాటరీ విధానంలో ఈనెల 23న నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మద్య నిషేధ ఎక్సైజ్ కమిషనర్ సూచనల మేరకు గద్వాల జిల్లా రిటైల్ అవుట్‌లెట్ల 34(ఏ4- షాపులు) దరఖాస్తులు సెప్టెంబరు 26వ తేదీ నుంచి అక్టోబరు 18 వరకు స్వీకరించబడతాయన్నారు. దరఖాస్తులు జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో గడువులోగా సమర్పించాలని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించిన తర్వాత లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు జరుగుతుందన్నారు.

23న కలెక్టరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మద్యం దుకాణాల కేటాయింపు ఎంపిక లాటరీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రాణాలు పోతున్నా పాలకులకు పట్టదా?

● సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి

● రాజోలి పొలిమేర రహదారిపై రాస్తారోకో



రాస్తారోకోలో రోడ్డు సమస్యలపై మాట్లాడుతున్న మాజీ ఉప సర్పంచ్ గోపాల్

రాజోలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలు పోతున్నా పాలకులకు పట్టదా అని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. రాజోలి నుంచి శాంతినగర్ వరకు ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని మంగళవారం కేవీపీఎస్ నాయకుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజలంతా కలిసి రాజోలి పొలిమేర నందు రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. రోడ్డు మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురై కాళ్లు, చేతులు విరిగి ప్రాణాలు పోతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. మూడు కిలోమీటర్ల పరిధిలో ప్రయాణం 30నిమిషాలు పడుతుందని, గర్భిణులు, వృద్ధులు, విద్యార్థులు ప్రయాణం చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాత్రివేళలో ఇసుక మాఫియాకు చెందిన టిప్పర్లు తిరగడం వల్ల రోడ్డు మొత్తం ధ్వంసమైందన్నారు. అలంపూరు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, కలెక్టర్ జోక్యం చేసుకుని రెండు రోజుల్లో రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, లేకుంటే ప్రజలతో కలిసి మళ్లీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం శాంతినగర్ ఎస్ఐ, రాజోలి ఎస్ఐ గోకారి సంఘటన స్థలానికి చేరుకుని అధికారులతో, నాయకులతో మాట్లాడి సమస్యలు పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడుతామని రాస్తారోకో విరమించాలని కోరారు. అయినా విరమించకపోవడంతో వడ్డేపల్లి తహసీల్దార్ శివ వచ్చి రెండు రోజుల్లో మరమ్మతులు చేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రాజోలి గ్రామ మాజీ ఉపసర్పంచ్ గోపాల్, కేవీపీఎస్ నాయకుడు విజయ్‌కుమార్, ఉద్యమకారుడు గోపాల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, జయన్న, రాజు, సుందరరాజు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై జాగ్రత్తలు తీసుకోండి



ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగులు

మల్దకల్(గద్వాల), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) గ్రామాలలో అంటువ్యాధులపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగులు మల్దకల్ మండల పరిధిలోని పెద్దపల్లిలో మంగళవారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు ప్రజలకు అవగాహన చేస్తున్నామని తెలిపారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని వివరించారు. వర్షాకాలం పూర్తయ్యే వరకు కాచి చల్లార్చిన నీటిని వడపెట్టి తాగాలని సూచించారు. అనారోగ్యం ఉంటే మీ ఆశా కార్యకర్తల ద్వార ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పరీక్షించుకొని మందులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు కేశవులు, హజ్రత్, స్వామి, భూపతి తమ ఆటపాటలతో అలరింప చేశారు.

బాధ్యతలు చేపట్టిన నూతన డీవైఎస్‌వో కృష్ణయ్య



గద్వాల అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన, సర్వీసుల అధికారిగా కృష్ణయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్రీడల అభివృద్ధికి తనవంతు తోడ్పాటును అందిస్తానన్నారు. అలాగే స్టేడియం అభివృద్ధి, క్రీడాకారులకు ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు. అనంతరం ఆయన కలెక్టర్ సంతోష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణయ్య

విద్యార్థులు సరైన లక్ష్యాన్ని ఎంచుకోవాలి

● జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రియాంక

గట్టు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఇప్పటినుంచే సరైన లక్ష్యాన్ని ఎంచుకుని తమ భవిష్యత్తుని తీర్చిదిద్దుకోవాలని జోగులాంబ గద్వాల జిల్లా ఉపాధి కల్పనా అధికారి డాక్టర్ ప్రియాంక విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని గట్టు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఆమె ప్రేరణ తరగతులు నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పదో తరగతి ఇంగిష్ మీడియం, తెలుగు మీడియం విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా కేరీర్ గైడెన్స్ తో పాటు మోటివేషనల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చెన్నయ్య, ఉపాధ్యాయులు జిన్నా, నరసింహగౌడు, నరసింహ తదితరులు ఉన్నారు.

ఇళ్ల కేటాయింపులో పేదలకు అన్యాయం

● ఎన్‌హెచ్‌పీఎస్ జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్

గద్వాల టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పేదలకు అన్యాయం జరిగిందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. ఈ విషయంలో అధికారులు రీ సర్వే చేపట్టి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. మంగళవారం సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంజిత్‌కుమార్ మాట్లాడారు. పదేళ్లుగా ఇల్లులేని పేదలు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నప్పటికీ, ప్రస్తుత కేటాయింపుల్లో కేవలం రాజకీయ అండదండలు ఉన్నవారికే లబ్ధి చేకూరిందని ఆరోపించారు. ఒక్కో గ్రామానికి అవసరమైన సంఖ్యలో ఇళ్లను కేటాయించకుండా రాజకీయ అండదండలు ఉన్నవారిని మాత్రమే లబ్ధిదారులుగా పేర్లు ప్రకటించారన్నారు. కొందరికి ఇప్పటికే ఆస్తులు, ఇళ్లు ఉన్నప్పటికీ వారికే మరోసారి ఇళ్లు మంజూరు కావడం ఏమిటని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

సమావేశంలో పోరాట సమితి జిల్లా నాయకులు వెంటక్రాములు, మల్దకల్ మండల అధ్యక్షుడు విష్ణు, శాంతన్న, కృష్ణ, చిన్నరాముడు, స్వామి ఉన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

● జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి

మానవపాడు, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న అలంపూర్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలని మంగళవారం సీఐటీయూ జిల్లాఅధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. ఈ సందర్భంలో మండల కేంద్రంలోని గాంధీచౌక్ ఆవరణలో సీఐటీయూ నాయకులకు, ఆటో యూనియన్ నాయకులకు సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటేశ్, మాలిక్, భాష, మధు తదితరులు ఉన్నారు.

పంటలపై రైతులకు అవగాహన

వడ్డేపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని కొంకల రైతువేదికలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం రైతునేస్తం కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. రైతులకు పంటలపై అవగాహన, తెగుళ్ల నివారణ పద్ధతులు, మందులు, పశువులకు వ్యాధులు, నివారణ టీకాల గురించి రాష్ట్రస్థాయి అధికారులు, శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాధ, వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారి వరప్రసాద్, కొంకల, తనగల గ్రామాల ఏఈవోలు విమల, వినోద్, రైతులు ఉన్నారు.

అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

● కోళ్ల ఫాంను ప్రారంభించిన డీసీసీ కార్యదర్శి సిరాజ్

మానవపాడు, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని డీసీసీ కార్యదర్శి మహమ్మద్ సిరాజ్ అన్నారు. మండల పరిధిలోని ఏ బూడిదపాడు గ్రామానికి చెందిన ప్రభావతి అనే మహిళలకు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి దాదాపు రూ.3 లక్షల వ్యయంతో కోళ్ల ఫాం నిర్మించారు. మంగళవారం డీసీసీ కార్యదర్శి సిరాజ్ దీన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభాకర్, మధు, శేఖర్, రమేశ్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ కూతురికి సన్మానం

ఉండవల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లికి చెందిన ఆటోడ్రైవర్ పెద్దయ్య కుమార్తె జి.లావణ్య ఇటీవల నీట్-2025లో మెడిసిన్‌లో సీటు సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం ఆటోడ్రైవర్లు, పెద్దయ్య లావణ్యకు మిఠాయి తిపిపించి, శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ప్రభాకర్, ఆటోడ్రైవర్లు సర్వేశ్వర్‌రెడ్డి, చాకలి కొండన్న, షేక్షావలి, మురళి, శ్రీనివాసులు ఉన్నారు.

ఎకో బజార్ పోస్టర్ల ఆవిష్కరణ

గద్వాల టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పర్యావరణం, అడవులు, వాతావరణంలో మార్పులపై మంత్రిత్వ శాఖ సహకారంతో తెలంగాణ నేషనల్ గ్రీన్ కోర్, కళాశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ బుధవారం ఉదయం 10గంటలకు కళాశాల ఆవరణలో ఎకో బజార్ పేరిట విద్యార్థులు రూపొందించిన పర్యావరణమిత్ర ఉత్పత్తులను ప్రదర్శిస్తారని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా తెలిపారు. వీటికి సంబంధించిన ఉత్పత్తుల పోస్టర్లను మంగళవారం కళాశాల వద్ద అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ప్రిన్సిపాల్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎకో క్లబ్ కన్వీనర్ డాక్టర్ సామల కరుణాకర్, పద్మ, కృష్ణ ఉన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ధరూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): 69వ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాస్థాయి అండర్-14 బాలబాలికలకు కబడ్డీ టోర్నమెంట్, ఎంపిక పోటీలను ఈనెల 15వ తేదీ బుధవారం ధరూర్ జడ్పీహెచ్ఎస్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

డిజిటల్ లెర్నింగ్‌పై శిక్షణ తరగతులు

గద్వాలసర్కిల్, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): గద్వాలలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్‌పై ప్రత్యేక శిక్షణ తరగతులు మాస్టర్ ట్రైనీస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. మంగళవారం కోడింగ్, డాటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఫిజికల్ కంప్యూటింగ్ అంశాలపై డిజిట్ మాస్టర్స్ ట్రైనర్స్ భాస్కర్‌పాపన్న, రాజు, శ్రీనివాసులు అవగాహన కల్పించారు.

ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల డిజిటల్ లర్నింగ్ శిక్షణకు గద్వాల, ఇటిక్యాల మండలాలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిక్షణా తరగతులకు గట్టు, కేటీదొడ్డి, ధరూర్ మండలాలకు చెందిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు హాజరయ్యారు.

పత్తి విక్రయానికి యాప్



కనీస మద్దతు ధరల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

● కనీస మద్దతు ధరల పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పత్తి అమ్మకానికి ముందు కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. మంగళవారం ఐడీవోసీ లోని తమ చాంబర్‌లో రైతుల అవగాహన కోసం కనీస మద్దత ధరల వివరాలు, కాటన్ కపాస్ కిసాన్ యాప్ ద్వారా పత్తికొనుగోలు ప్రక్రియపై సమాచారాన్ని అందించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 2025-26 పత్తి పంటకు కనీస మద్దతు ధర, పత్తి పింజ రకం బీటీమోడ్- రూ.8,110, బీటీ ఎస్పీఎల్-రూ.8,060, మెక్- రూ. 8,010 ఒక్కో క్వింటాల్‌కు వర్తిస్తాయన్నారు. వ్యవసాయశాఖ ద్వారా రైతులు తమ పత్తిపంటను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటీపీ కోసం ఆధార్‌లింక్ ఉన్న మొబైల్ ఉండాలని, నగదు చెల్లింపుల కోసం బ్యాంకు ఖాతాను ఆధార్‌తో లింక్ చేయించడం అత్యంత అవసరమని తెలిపారు. తేమశాతం 8- 12 ఉండాలన్నారు. పత్తిని అమ్మడానికి వచ్చే ముందు రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. జిల్లాలోని హరిత కాటన్‌మిల్, బాలాజీ కాటన్ జిన్నింగ్ మిల్, వరసిద్ధి వినాయక కాటన్ మిల్లులు ఉన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి పుష్పమ్మ, గద్వాల మార్కెట్ కార్యదర్శి నరసింహ, అలంపూర్ మార్కెట్ కార్యదర్శి ఎల్లస్వామి ఉన్నారు.

● బెస్ట్ అవైలబుల్ పాఠశాల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల సంక్షేమంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ చెప్పారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖామంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర సాంఘిక సంక్షేమ,గిరిజన, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడారు.

బాధ్యత, సేవతో కూడినది పోలీసు ఉద్యోగం

● పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ శ్రీనివాసరావు



గద్వాల పట్టణ పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పోలీస్ ఉద్యోగం కేవలం విధి నిర్వహణ మాత్రమే కాదని అది ప్రజల పట్ల ఉన్న బాధ్యత, సేవాభావం, చట్టపరిరక్షణ అధికారుల సమన్వయంతో కూడిన పవిత్రమైన సేవ అని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం పట్టణ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పట్టణ పోలీసుస్టేషన్ పరిసరాల శుభ్రత, సిబ్బంది బ్యారక్స్, స్టేషన్ రికార్డుల మెయింటేన్స్‌ను పరిశీలించారు. అనంతరం డీఎస్పీతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎస్పీ మొగులయ్య, గద్వాల పట్టణ ఎస్ఐ-1 కళ్యాణ్‌కుమార్, ఎస్ఐ-2 సతీష్‌కుమార్, ఎస్ఐ-3 జహంగీర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆటపాటలతో విద్య అందేలా చూడాలి

● స్త్రీ, శిశు సంక్షేమ అధికారి సునంద

అయిజ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆటపాటలతో చిన్నారులకు విద్యను అందించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి సునంద ఆదేశించారు. పోషణమాసం కార్యక్రమంలో భాగంగా బుధవారం అయిజవెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వారిని ఉద్దేశించి మాట్లాడారు. పోషణ అభియాన్ నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ఆహారం శరీరానికి తగినంతగా అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీవో భాస్కర్, సీడీపీవో హేమలత, సూపర్‌వైజర్ తెల్లమ్మ, ఏపీఎం జయాకర్ పాల్గొన్నారు.

● దివ్యాంగులు, వయోవృద్ధుల సంఘాలను అధికారికంగా నమోదు చేయాలి

గద్వాలన్యూటౌన్: మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే దివ్యాంగులు, వయోవృద్ధుల సంఘాలను తమ శాఖలో అధికారికంగా నమోదు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి సునంద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆయా సంఘాల రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాల ప్రతులను, సంఘంలోని కార్యవర్గ సభ్యులు, ఇతర సభ్యుల జాబితా మొదలైన వివరాలను ఈ నెల 18లోగా ఐడీవోసీలోని తమ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ప్రభుత్వ సమావేశాలు, ఇతర కార్యక్రమాల్లో భాగస్వామ్యం కల్పించనున్నట్లు ఆమె తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కే.టి.దొడ్డి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు సంబంధించిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే మల్దకల్ మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే సీఎం సహాయనిధి నుంచి వచ్చిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్వ హనుమంతు, సీనియర్ నాయకులు వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ రాజశేఖర్, మాజీ ఎంపీపీ రామకృష్ణనాయుడు, నాయకులు సత్యారెడ్డి, విక్రంసింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ విష్ణు, మాజీ సర్పంచు శివరాంరెడ్డి, ఉన్నారు.

● ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం పట్టణంలోని రాఘవేంద్రకాలనీకి చెందిన అలేఖ్యకు మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.1.50 లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీమన్నారాయణ, నరహరిగౌడు ఉన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమమే మద్దిలేటికి నివాళి

● టీపీఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ ప్రభాకర్



మద్దిలేటి స్మారక స్తూపం వద్ద వాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

గద్వాల టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో ప్రజల సమస్యలపై నిరంతం పోరాటాలు సాగించడమే మద్దిలేటికి నిజమైన నివాళి కాగలదని తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్) రాష్ట్ర కోకన్వీనర్ శంకర ప్రభాకర్ అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలకభూమిక పోషించిన పులి మామిడి మద్దిలేటి పదవ వర్ధంతిని మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రెండవ రైల్వేగేటు సమీపంలోని అమరుల స్తూపం వద్ద టీపీఎఫ్ ఆధర్యంలో ప్రజాసంఘాల నాయకులు దివంగత నాయకుడికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సంఘాల నాయకులు, ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూనే నడిగడ్డలో సీడ్ పత్తి సాగు చేసే రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని, మోసాలను నిరసిస్తూ తొలిసారి ఎర్రవల్లి చౌరస్తాలో పెద్దఎత్తున రాస్తారోకో నిర్వహించడం ద్వారా సమస్యను ప్రభుత్వం దృష్టికి తెచ్చారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జీవితాంతం అవిశ్రాంతం పోరాటం సాగించిన మద్దిలేటి నేటి పోరాటాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎండీ సుభాన్, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్, టీపీఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మన్యంకొండ, ఇక్బాల్ బాషా, ఉదయ్‌కిరణ్, దానయ్య, హలీంపాషా, రంగస్వామి, కురువపల్లయ్య, కమిటీ సభ్యులు నాగిరెడ్డి, స్వామి, మద్దిలేటి సతీమణి దానమ్మ, కూతురు లలిత, చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షుడు జయమ్మ, సునీత ఉన్నారు.

రైతు అభ్యున్నతే మోదీ ప్రభుత్వ లక్ష్యం

● బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతే ప్రధాని మోదీ ప్రభుత్వం లక్ష్యమని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం అయిజలోని ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందించే వేరుశనగ విత్తన ప్యాకెట్లను రైతులకు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంఈఓ పథకం ద్వారా రైతులకు ఉచితంగా అందజేస్తున్న టీఏజీ 24 కే61 రకం 60 పంట, దిగుబడి అధికంగా వస్తుందని తెలిపారు. అయిజ మండలంలోని 1,250 మంది రైతులకు ఈ పథకం ద్వారా ప్రతీ రైతుకు 60 కిలోల చొప్పున ఉచితంగా అందిస్తుందన్నారు. రైతులు కేవలం రూ.1,100 చెల్లించి ఉత్పత్తిదారుల సంఘంగా నమోదు చేసుకుంటే మార్కెటింగ్, విత్తన సరఫరా, డ్రిప్, స్ప్రింకర్లు ఎన్నో కేంద్రప్రభుత్వ పథకాలు భవిష్యత్‌లో అందుతాయని వివరించారు.